

..మోసం గ్యారంటీ!
హామీలకు లేదు ష్యూరిటీ.. మోసాలే గ్యారంటీ..! అంటూ డెప్యూటీ మాజీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. - 8లో



విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు
ప్రజలకు భారంగా పరిణమించే విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. - 8లో



నకిలీ లాటరీ టికెట్లు
పుంగనూరులో నకిలీ లాటరీ టికెట్ల విక్రయాలు జోరందుకున్నాయి. కొందరు ధనార్జనే ధ్యేయంగా చెలరేగిపోతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్
చిత్తూరు లీగల్: చిత్తూరు పూర్వపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తెలిపారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లో పెండింగ్ కేసుల పరిష్కారం కోసం మొత్తం 35 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాజీ చేసుకోదగ్గ సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, బీమా.. ఇతర కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

నేడు విజయవాడకు డీఈఓ
చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈనెల 5న డీఈఓలతో నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌కు డీఈఓ వరలక్ష్మి హాజరుకానున్నారు. ఈ మేరకు ఈ నెల 04వ తేదీన డీఈఓతో పాటు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, డీవైఈఓ ఇందిరా, పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు.

7, 8 తేదీల్లో ఏఎన్‌ఎంలకు జూమ్ కౌన్సెలింగ్
చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని ఏఎన్‌ఎంలకు ఈనెల 7, 8 తేదీల్లో జూమ్ కౌన్సెలింగ్ ఉంటుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి తెలిపారు. ఈ మేరకు శనివారం సీనియారిటీ జాబితాను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే సోమవారం తెలియజేయవచ్చని తెలిపారు. జూమ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపడుతామని ఆమె పేర్కొన్నారు.

కాణిపాక హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు



హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన హుండీని శుక్రవారం ఆలయ అధికారులు పగడ్బందీగా లెక్కించారు. ఈవో పెంచల కిషోర్ పర్యవేక్షణలో జరిగిన ఈ హుండీ లెక్కింపులో రూ.1,68,18,705 ఆదాయం వచ్చింది. బంగారం 52 గ్రాములు, వెండి 1.4 కిలోలు వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.16,783, నిత్య అన్నదానం హుండీ ద్వారా రూ.38,751 వచ్చింది. యూఎస్‌ఏ డాలర్లు 980, సింగపూర్‌వి 33 డాలర్స్, మలేషియావి 64 రింగిట్స్, యూఏఈ 25 దిర్హామ్స్, కెనడా 140 డాలర్లు, ఆస్ట్రేలియావి75 డాలర్స్ వచ్చాయి. ఏఈవోలు ఎ స్వీ క్రిష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, నాగేశ్వరరావు, కోదండపాణి, సుబ్రమణ్యానాయుడు పాల్గొన్నారు.

10న సత్యనారాయణ వ్రతం
కాణిపాకం: పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధ ఆలయమైనా శ్రీ వరదరాజులస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించనున్నట్టు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం 8 నుంచి ఈ సామూహిక వ్రతం జరుగుతుందన్నారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులను వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఎస్‌ఈ కార్యాలయంలో ఆపరేషన్, ఎంఆర్‌టీ, నిర్మాణ విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చిత్తూరు నియోజకవర్గంలో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, ఎక్కువగా గ్రామాల్లో అభ్యంతరాలు వస్తున్నాయని చెప్పారు. రోడ్డు, పొలాల పక్కన పనులకు అంగీకారం తెలపడం లేదన్నారు. ఈ పథకం ఎంతో ఉపయోగం అనే వివరాలు వారికి తెలపాలన్నారు. వీటి ద్వారా గ్రామాలకు త్రీ ఫేజ్ కరెంటు, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు వస్తాయన్నారు. ఈఈలు అమర్‌బాబు, బాబు, జగదీష్, మునిచంద్ర, సురేష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి
చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న విద్యార్థులు, తల్లుల బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఎన్‌పీసీఐ అనుసంధానం కచ్చితంగా చేయించుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనం పథకం లబ్ధి పొందేందుకు విద్యార్థులు, తల్లుల బ్యాంక్ ఖాతాలకు కచ్చితంగా ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలన్నారు. సమీపంలోని గ్రామ, వార్డు సచివాలచిపారా వెళ్లి అనుసంధాన ప్రక్రియ ను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఒక వేళ ఖాతా లేకపోతే సమీపంలోని పోస్టాఫీసులో ఖాతాను తెరిచి ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు.

బిల్లులిచ్చేద్దాం..!



కాలువలో అసంపూర్తి పనులు

- రూ.150 కోట్ల బిల్లులు చెల్లింపునకు సిద్ధం
- పీఏఓ నుంచి నేడో రేపో మంజూరు
- పీబీసీలో రూ.10 కోట్ల మేర అడ్వాన్స్‌ల చెల్లింపు?
- స్వామిభక్తి చాటుకుంటున్న హంద్రీ–నీవా అధికారులు

కూటమి ప్రభుత్వంలో అధికారుల స్వామి భక్తి ఎక్కువైంది. పనిచేసినా చేయకపోయినా.. నాణ్యత ఉన్నా లేకపోయినా బిల్లులు చెల్లించేందుకు ఇట్టే సిద్ధమైపోతున్నారు. అదీ సీఎం సన్నిహితులు.. బంధువులకు సంబంధించిన కాంట్రాక్ట్ సంస్థలైతే ఇక చెప్పనక్కర్లేదు. ఏమీ చూడకుండానే బిల్లులు మంజూరు చేసేందుకు సన్నద్ధమైపోతున్నారు. ఇలాంటిదే హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండో దశ పనుల్లో చోటు చేసుకుంది. పుంగనూరు ఉపకాలువ (పీబీసీ), కుప్పం ఉపకాలువ (కేబీసీ) పనులకు సంబంధించి ఇంకా పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమాణాలపై ఉన్నతాధికారులు అంచనాకు రాకముందే బిల్లులన్నీ చెల్లించేందుకు సిద్ధమవడం గమనార్హం.

మదనపల్లె: కూటమి ప్రభుత్వం వచ్చాక పీబీసీలో 117.767 కిలోమీటర్ల లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనులను నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీకి రూ.480.22 కోట్లతో నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టింది. తర్వాత ఈ పనుల విలువను రూ.366 కోట్లకు కుదించి కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకుంది. కేబీసీకి సంబంధించి రెండు రీచ్‌లుగా పనులకు టెండర్లు నిర్వహించగా సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థ ఎక్సెస్‌తో పనులు దక్కించుకుంది. ఒకటో రీచ్‌ను రూ.81,43,61,130తో టెండర్ పిలవగా రూ.85,46,72,008 కోట్లకు, రెండో రీచ్‌ను రూ.80,35,99,740 కోట్లతో టెండర్ పిలవగా రూ.84,33,77,923 కోట్లతో రిత్విక్ ప్రాజెక్ట్స్ పనులు దక్కించుకుంది. ఈ మేరకు ఏప్రిల్‌లో కాలువల పనులు మొదలయ్యాయి.

సీఈ నివేదికలోగా జరిగిపోవాలి

ఈస్ట్‌కోస్ట్ క్వాలిటీ కంట్రోల్ సీఈ శేషుబాబు ఈ రెండు కాలువల్లో జరుగుతున్న పనులను పూర్తిగా పరిశీలించారు. గతంలో ఏ అధికారి కూడా పనుల నాణ్యతపై కాలువల్లో జరిగిన పని మొత్తాన్ని పరిశీలించిన దాఖలాలేవు. అయితే శేషుబాబు మొత్తం పరిశీలించి వెళ్లగా, దీనిపై నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. పరిశీలన ముగిసి ఒకరోజు మాత్రమే గడవడంతో ఆ నివేదికలో ప్రతికూల అంశాలను ప్రస్తావిస్తే బిల్లుల చెల్లింపుపై ప్రభావం చూపుతుందని అధికారులు పీఏఓ కార్యాలయ అధికారులపై ఒత్తిడి తెస్తూ బిల్లులకు ఆమోదం తెలిపి మంజూరు చేయాలని కోరుతున్నట్టు తెలిసింది. నివేదిక ప్రభుత్వ పరిశీలనలోకి వెళ్లాక బిల్లులకు బ్రేక్ పడే అవకాశం ఉండొచ్చని అధికారులు భావిస్తున్న తరుణంలో ఒత్తిళ్లతో ఒకట్రెండోజుల్లో మొత్తం బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులే చెబుతుండడం విశేషం.

పర్యవేక్షణ లేదనే సీఈ రాక

రెండు ఉపకాలువల లైనింగ్, షార్ట్ క్రీటింగ్ పనుల విషయంలో తిరుపతి క్వాలిటీ కంట్రోల్, మదనపల్లె ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడం వల్లే క్వాలిటీ కంట్రోల్ సీఈ శేషుబాబు విచారణకు వచ్చినట్టు చెబుతున్నారు. సీఈ పరిశీలనతో ఇక్కడి క్వాలిటీ కంట్రోల్ అధికారుల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడి అధికారులు కాంట్రాక్టు సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. ఈ పరిస్థితుల్లో జరిగే పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

చకచకా రూ.150 కోట్ల బిల్లులు



పుంగనూరు ఉపకాలువలో కనిపిస్తున్న బండరాళ్లు

రెండు ఉప కాలువలకు సంబంధించి జరిగిన పనులపై ప్రాజెక్టు అధికారులు వెంటనే బిల్లులకు సిద్ధమయ్యారు. కుప్పం కాలువ పనులు సీఎం చంద్రబాబు సన్నిహితుడైన ఎంపీ సీఎం రమేష్ సంస్థ కావడంతో పనులు చాలా వేగంగా జరిగాయని, వాటికి అంచనా కట్టిన అధికారులు బిల్లుల మంజూరుకు ఆగమేఘాల మీద రికార్డులు సిద్ధం చేశారు. మొదటి రీచ్‌కు రూ.42,58,17,772, రెండో రీచ్‌కు రూ.44,81,98,813, పుంగనూరు కాలువకు రూ.60 నుంచి 63 కోట్లలోపు బిల్లులను సిద్ధం చేసి కాంట్రాక్టు సంస్థలకు చెల్లింపులు జరిగేలా చిత్తూరు పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ కార్యాలయానికి నివేదించారు. ఈ స్థాయిలో ఒకేసారి బిల్లులు పెట్టడం అరుదైన విషయమని ప్రాజెక్టు అధికారుల్లోనే చర్చ జరుగుతోంది. దీనికి ముఖ్యంగా అధికారుల్లో చోటుచేసుకున్న స్వామి భక్తే కారణమని అంటున్నారు. 90 కిలోమీటర్ల కుప్పం కాలువ పనుల పర్యవేక్షణ బాధ్యత కేవలం ఒక ఈఈ, ఒక డీఈకే అప్పగించారు. పుంగనూరు కాలువకు సంబంధించి కూడా ఒకరిద్దరు డీఈలకే ఎక్కువ కిలోమీటర్ల పనులు అప్పగించారు. వీరి పర్యవేక్షణ పరిధిలోని పనులకే ఎక్కువ మొత్తంలో బిల్లులు పెట్టినట్టు తెలుస్తోంది. వీరికి కాలువ పనుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఇలా బిల్లుల రూపంలో భక్తి ప్రదర్శిస్తున్నట్టు స్పష్టం అవుతోంది.

రూ.10 కోట్ల అడ్వాన్స్?
పుంగనూరు ఉపకాలువకు సంబంధించిన పనుల విషయంలో డీఈ వెంకటప్రతాప్ కాంట్రాక్టు సంస్థ పనులు చేయకనే అడ్వాన్స్ రూపంలో రూ.10 కోట్లకుపైగా మంజూరు చేశారని సమాచారం. ఈ అడ్వాన్స్, జరిగిన పని కలుపుకుని తాజాగా బిల్లులు పెట్టారని తెలిసింది. పని జరక్కనే అడ్వాన్స్ రూపంలో బిల్లులు ఇవ్వడం జరగదు. అయినప్పటికీ ఇచ్చారని చెబుతున్నారు. దీనిపై డీఈ వెంకటప్రతాప్ వివరణ కోరగా అడ్వాన్స్ నిధులు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు.

జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



భూమన కరుణాకరరెడ్డితో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

తిరుపతి మంగళం : మామిడి రైతులకు అండగా నిలిచేందుకు ఈనెల 9వ తేదీ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి విచ్చేయనున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా భూమనను కలిశారు. అనంతరం మామిడి రైతులకు అండగా నిలిచేందుకు వస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమంపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భూమన సూచించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



బీమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సూచించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతింటే ఈ పథకం ద్వారా నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకునే రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. చిత్తూరు జిల్లాలో వరికి రూ.42 వేలు, రాగికి రూ.17 వేలు, కందులకు రూ.20 వేలు ఒక ఎకరానికి బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు క్లస్టర్ మేనేజర్ సాగర్ 9059634144 నంబర్‌లో సంప్రదించాలన్నారు. డివిజనల్ కో ఆర్డినేటర్ పెద్దన్న పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేకాలు





విశేషాలంకరణలో అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆషాఢమాసపు తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలతో విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నకిలీ డాక్టరేనా?
చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శుక్రవారం ఓ డాక్టర్ నకిలీ కార్డియాలజిస్ట్ అనే ప్రచారం జోరందుకుంది. గుంటూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి గుంటూరులో ఫేక్ డాక్టర్‌గా చెలామణి అయ్యాడనే ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ గుట్టురట్టు కావడంతో అదృశ్యమయ్యాడనే విమర్శలు వస్తున్నాయి. కొన్నాళ్లకు చిత్తూరులో ప్రత్యక్షమయ్యాడనే ప్రచారం జోరందుకుంది. కార్డియాలజిస్ట్‌గా అవతారమెత్తి.. డాక్టర్లను కార్డియాలజిస్ట్‌గా నమ్మించాడనే విమర్శలు వస్తున్నాయి. ఈ నకిలీ డాక్టర్ వ్యవహారం సామాజిక మాధ్యమం ద్వారా హల్‌చల్ చేస్తోంది. దీనిపై ఓ ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ ఆ డాక్టర్‌కు సర్టిఫికెట్ ఉంది.. నకిలీ కాదని వివరణ ఇచ్చుకున్నారు. ప్రభుత్వ వైద్య నిపుణులు మాత్రం ఆ సర్టిఫికెట్లు నకిలీవని చెబుతున్నారు.

మన్యం వీరుడు అల్లూరి





అల్లూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, నివాళి అర్పిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : బ్రిటీష్ పాలకులపై సాయుధ పోరాటం చేసిన అసమాన పరాక్రమశాలి అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ కొనియాడారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులపై విలక్షణమైన రీతిలో సాయుధ పోరాటం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జన్మించిన జిల్లాలో తాను జన్మించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌వో మోహన్ కుమార్, ఏవో వాసుదేవన్, సీపీవో శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీబాషా పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి

చిత్తూరు అర్బన్: మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరు సీతారామరాజు పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చిత్తూరు ఎస్పీ మణికంఠ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడడం, న్యాయాన్ని నిలబెట్టడం, నిబంధనలు అమలు చేయడంలో పోలీసుశాఖకు అల్లూరు ఆదర్శమన్నారు. ఏఎస్పీలు రాజశేఖరరాజు, శివానంద కిషోర్, డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

36 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చేసిన 36 మందికి రూ.90 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. గత వారం రోజులుగా చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర తన సిబ్బందితో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 30 మందిపై, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున.. రూ.60 వేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినందుకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున రూ.30 వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీచేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

చిత్తూరు కార్పొరేషన్: ప్రజల పై భారం పెంచే స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడారు. ఇందుకు నిరసనగా ప్రభుత్వం పై వ్యతిరేకతను తెలియజేయడానికి క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేశారు. వీటిని ప్రజలు స్కాన్ చేసి స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తమ నిరసనను తెలియజేయాలన్నారు. అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలు పెంచమన్న బాబు ఇప్పుడు ఎందుకు పెంచుతున్నారని నిలదీశారు. వేల కోట్ల రూపాయలు వినియోగదారుల పై భారం వేయడం దారుణమన్నారు. కరపత్రాలను ఇంటింటికీ అందజేయనున్నట్టు చెప్పారు. నాయకులు జ్యోతిరావు, అయ్యప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

14న సంకటహరగణపతి వ్రతం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 14వ తేదీన సంకట హర గణపతి వ్రతాన్ని నిర్వహించనున్నట్టు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

13 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి శుక్రవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

హామీలకు లేదు ష్యూరిటీ..
మోసం గ్యారెంటీ

- హామీలు అమలు చేయని మొనగాళ్లు చంద్రబాబు, పవన్ కళ్యాణ్
- మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ధ్వజం
- రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరణ

కార్వేటినగరం: అధికారం చేతికి వచ్చాక ఇచ్చిన మాట మర్చిపోయిన మొనగాళ్లు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం కొల్లాగుంట చెక్‌పోస్టు సమీపంలోని వెట్రివేల్ కల్యాణ మండపంలో నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లతాబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిల్లనిచ్చిన సొంత మామ ఎన్టీఆర్‌ను వెన్ను పోటు పొడిచిన చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలను మోసం చేయడం లెక్కలేదన్నారు. అబద్ధాలు, మోసాలు, వెన్నుపోటు వంటివి బాబుకు వెన్నెతో పెట్టిన విద్య అన్నారు. కూటమి ఎమ్మెల్యేలు అడవులు, గుట్టలను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇదేనా బాబు దృష్టిలో సంపద సృష్టించడం అని చురకలు అంటించారు. నెల రోజులకు పైగా మామిడి రైతులు గిట్టుబాటు ధరలేక, పండించిన పంటను తరలించ లేక తల్లడిల్లి పోతుంటే ఏమీ ఎరుగనట్టు బాబు మొహం చాటేయడం దారుణమన్నారు. పేదల ఓట్ల కోసం పంపిణీ చేసిన కూపన్లకు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ రూ.5 వేలు చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు. దండుకున్నది చాలక ఎమ్మెల్యేలు మామిడి గుజ్జు పరిశ్రమలనే కాకుండా రైతులు తరలించే మామిడిలోనూ కమీషన్లకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి, సమన్వయకర్త కృపాలక్ష్మి

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు వెన్నుపోటు

సీఎం కుర్చీ కోసం కూటమిగా ఏర్పడి సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను వెన్ను పోటు పొడిచాడని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. అధికార దాహంతో 143 హామీలు గుప్పించి ఏడాది పాలనలో కేవలం రెండు పథకాలను అరకొరగా అమలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

ఈ క్రమంలో భాగంగా నూతనంగా నియామకాలు చేపట్టిన వెంకటేష్, మోహనకుమారి, ఆకులగోపి, గాంధీ, మురళీకృష్ణారెడ్డి, మురగయ్య, శ్రీనివాసులురెడ్డి, అన్నివర్గాల అధ్యక్షులను రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లతాబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు చేతుల మీదుగా శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడి గురవారెడ్డి, నియోజవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధికారెడ్డి, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు ప్రకాష్, రాధిక, సుగుణమ్మ, నియోజకవర్గ యువజ విభాగం అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కార్తిక్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, మురగయ్య, లోకనాథరెడ్డి, ధనంజయవర్మ, మునికృష్ణ, నందగోపాల్, లడ్డు పాల్గొన్నారు.

బాండ్లు చూపించి నిలదీయండి

సూపర్‌సిక్స్ హామీల పేరిట ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రతి ఇంటికీ బాండ్లు పంచారు. అధికారంలోకి వచ్చాక వాటిని ఎందులు అమలు చేయలేక పోతున్నా రో చెప్పాలి. బాండ్లు చూపించి ఇంటింటికీ మన ప్రభుత్వం పేరుతో వస్తున్న నాయకులను గ్రామా ల్లో మహిళలు నిలదీయాలి. – కృపాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, జీడీనెల్లూరు

అక్రమ కేసులకు భయపడం

చంద్రబాబు ఏడాది పాలన అంతా రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం నడిచింది. వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారు. మహిళలు, చిన్నారులపై రాష్ట్ర వ్యాప్తంగా అఘాయిత్యాలు చేయడమే కూటమి నాయకులు పనిగా పెట్టుకున్నారు. కేసులకు, దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదు. – శేఖర్‌రాజు, పార్టీ మండల కన్వీనర్

కలసికట్టుగా ముందుకు

ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిన వైఎస్ జగమోహన్ రెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేద్దాం. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే. సూపర్‌సిక్స్ పేరుతో చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేశారు. – బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి

అరాచకాలను తిప్పికొట్టాలి

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడడం పిరికి పంద చర్య. కురుక్షేత్రంలో వేలాది సైన్యం పాండవుల చేత కుప్ప కూలిపోయినట్లు, కూటమి ప్రభుత్వం కూడా జగనన్న చేతిలో కూలిపోవడం ఖాయం. కూటమి ప్రభుత్వంలో ఆడ బిడ్డలు బయటకు రావడానికి భయపడుతున్నారు. – లతబాలాజీ, ఎంపీపీ

వ్యవస్థలు నాశనం

కూటమి ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను నాశనం చేస్తోంది. చట్టాన్ని చేతిలోకి తీసుకుని ప్రతిపక్ష నాయకులను అణగదొక్కడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి బెదిరింపులకు దిగుతున్నారు. – చందురాజు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి

డ్రైవర్ ఆత్మహత్య



దామోదరం

బంగారుపాళెం: కుటుంబ కలహాల కారణంగా డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం బంగారుపాళెం మండలంలో చోటుచేసుకుంది. సీఐ కథనం.. యాదమరి మండలం, సీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన చాకల మునిరత్నం కుమారుడు చాకల దామోదరం(49) కోళ్ల వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నడు. మద్యానికి బానిస కావడంతో ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన దామోదరం బంగారుపాళెం సమీపంలోని కొత్తపల్లె రోడ్డు వద్ద కోళ్ల వాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మూడు నెలల్లో రూ.38.15 కోట్ల ఆదాయం



రమణమూర్తి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ పరంగా ఆదాయం మూడు నెలల్లో రూ.38.15 కోట్లు వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్ రమణ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం జిల్లా ఆదాయ లక్ష్యం రూ.218 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు రూ.38.15 కోట్లు వచ్చిందన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం రూ.50.17 కోట్లు లక్ష్యంగా కాగా అందులో రూ.38.15 కోట్లు ఆర్జించినట్టు వెల్లడించారు. ఇందులో బంగారుపాళ్యం రూ.2.05 కోట్లు, కుప్పం రూ.5.55 కోట్లు, పలమనేరు రూ.8.12 కోట్లు, పుంగనూరు రూ.4.40 కోట్లు, కార్వేటినగరం రూ.1.34 కోట్లు, నగరి రూ.3.24 కోట్లు, చిత్తూరు ఆర్వో రూ.9.67 కోట్లు, చిత్తూరు రూరల్ రూ.3.74 కోట్లు వచ్చిందన్నారు. గతంలో నాన్ జ్యూడిషియల్ స్టాంప్ పేపర్స్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యేవి కావని, ప్రస్తుతం ఈ సమస్యను ఐజీ కార్యాలయం పరిష్కరించిందని చెప్పారు.

మానవత్వం పరిమళించి..స్థానికంగా విస్మరించి!

- పసివాడి ప్రాణాన్ని కాపడిన ఓ ఎమ్మెల్యే
- మరో పాప ప్రాణాన్ని కాపాడలేని మరో ఎమ్మెల్యే
- రెండు ఘటనలు పలమనేరు నియోజక వర్గంలోనే..
- ఈ రెండింటిపై సోషల్ మీడియాలో రచ్చ..రచ్చ

పలమనేరు: చావు బతుకుల్లో ఉన్న పసిప్రాణాలను కాపాడుకోవాలని ఏ తల్లిదండ్రులకైనా ఉంటుంది. దీనికోసం వారు పడని కష్టాలుండవు. ఇందుకోసం మానవత్వమున్న వారెవరైనా సాయం చేస్తుంటారు. కానీ ఓ ప్రజాప్రతినిధి ఓ పసివాడి ప్రాణాన్ని కాపాడగా మరో ప్రజాప్రతినిధి ఓ పాప ప్రాణం పోయేందుకు కారణమైన వేర్వేరు ఘటనలు ఇటీవల పలమనేరు నియోజకవర్గంలో చోటుచేసుకున్నాయి. ఈ రెండు ఘటనలపై బాధితుల ఆవేదన సోషల్ మీడియాలో ఇప్పుడు హల్‌చల్ చేస్తోంది.

పసివాడి ప్రాణం ఇలా నిలబెట్టారు

పలమనేరు పట్టణానికి చెందిన గజ్జల దీపునాయుడు, జగదీష్ దంపతుల కుమారుడికి పుట్టుకతోనే కాలేయ సమస్య ఉంది. బాబుకు ఆపరేషన్‌కు రూ.20లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు తేల్చారు. బిడ్డకు ఆపరేషన్ చేయించే ఆర్థిక స్తోమత వారికి లేదు. పలు స్వచ్ఛంద సంస్థలు, వారికి తెలిసిన వారి ద్వారా పసివాడి ప్రాణాలను కాపాడుకునేందుకు ఆరు నెలలుగా కష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో పలమనేరుకే చెందిన ఓ టీడీపీ కార్యకర్త వీరి గోడు విని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందుతుందని ధైర్యం చెప్పారు. వెంటనే పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలిసేందుకు వారి కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. అక్కడున్న పీఏతో వారు గోడు వెళ్లబోసుకున్నారు. కానీ ఆయన పట్టించుకోలేదు. దీంతో ఆ కార్యకర్త మదనపల్లిలోని తన సోదరి ద్వారా ఇంతియాజ్ అనే వ్యక్తి సాయంతో అక్కడి ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలిశారు. పిల్లాడి పరిస్థితి విన్న ఆయన వెంటనే స్పందించి లెటర్ ఇచ్చి మంత్రి లోకేష్ ద్వారా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.15 లక్షలను మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆ పసివాడు బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఆ ఆస్పత్రి నుంచి పసివాడి కోసం పోరాడిన టీడీపీ మహిళా కార్యకర్త సోషల్‌మీడియా ద్వారా విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. మన ఎమ్మెల్యే చేయలేని పని పక్క జిల్లా మదనపల్లె ఎమ్మెల్యే చేశారే అని ఆ పార్టీ వాళ్లే చర్చించుకుంటున్నారు.





మదనపల్లె ఎమ్మెల్యే చొరవతో మణిపాల్‌లో చికిత్స పొందుతున్న పసివాడు, అండగా నిలిచిన యువతి

మరో పాప విషయంలో ఏమి జరిగిందంటే...

బైరెడ్డిపల్లి మండలం, తీర్థం పంచాయతీ, కై గల్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు జనసేన కార్యకర్త. ఇతనికి ముగ్గురు పిల్లలు. రెండో కుమార్తె సౌమ్యకు పచ్చకామెర్లు ముదిరి లివర్ దెబ్బతింది. బాలికను పరిశీలించిన డాక్టర్లు లివర్ మార్పిడి చేయాలని ఇందుకోసం రూ.30 లక్షల దాకా ఖర్చవుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబును కలిసి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సాయం పొందే అవకాశం ఉందని కొందరు చెప్పారు. నియోజకవర్గ జనసేన నాయకుని ద్వారా స్థానిక ఎమ్మెల్యే లెటర్ కోసం పలుద ఫాలు ప్రయత్నం చేసినా కుదరలేదు. దీంతో కుప్పానికి చెందిన వారి బంధువైన మండల స్థాయి నేత ద్వారా ఇక్కడి ఎమ్మెల్యే సిఫారస్సు లెటర్ కోసం ప్రయత్నించారు. ఓ రోజు ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నారని తెలిసి శ్రీనివాసులే స్థానిక పార్టీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేతో మాట్లాడి లెటర్‌పై సంతకం చేస్తుండగానే లోకల్ లీడర్లు ఏమి చెప్పారోగానీ సంతకం పెట్టలేదు. ఇదేంటంటే మీ మండలంలోని నాయకులు కాకుండా కుప్పం వాళ్ల రెకమెండేషన్ ఏంటని అభ్యంతరం చెప్పినట్టు తెలిసింది. ఏమీ చేయలేక ఆ జనసేన కార్యకర్త వచ్చేశాడు. గతనెల 24న ఆ పాప మృతి చెందింది. దీనిపై కడుపు మండి ఆ తండ్రి తనకు జరిగిన అన్యాయాన్ని తన బిడ్డను కాపాడుకోలేకపోయాననే బాధను సోషల్ మీడియాలో వ్యక్తం చేశాడు. ఇలా ఈ రెండు ఘటనల వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.





లెటర్‌పై సగం సంతకంతో ఆపేసిన పలమనేరు ఎమ్మెల్యే, ఆపరేషన్‌కు డబ్బుల్లేక మృతి చెందిన సౌమ్య

జోరుగా నకిలీ లాటరీ టికెట్ల విక్రయాలు

పుంగనూరులో నకిలీ లాటరీ టికెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు ధనార్జనే ధ్యేయంగా మధ్య తరగతి కుటుంబాల వారు, అమాయకులు, కూలీలను టార్గెట్ చేసి రూ.లక్షల టికెట్లను విక్రయిస్తున్నారు. రోజూ రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. వారికి అధికార పార్టీ నేతలు అండదండలు పుష్కలంగా ఉండడంతో పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో మధ్య తరగతి, సామాన్య కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- భిన్నాభిన్నమవుతున్న మధ్యతరగతి కుటుంబాలు
- అమాయకులు, కూలీలకు ఎరవేస్తున్న దళారీలు
- రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణానికి చెందిన కొందరు సులభంగా డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా నకిలీ లాటరీ టికెట్ల విక్రయాలను ఎంచుకున్నారు. ఏజెంట్లను నియమించుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో టికెట్ రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తూ రోజూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రధానంగా లాటరీ విక్రయాలు ప్రజలు గుమికూడే టీ దుకాణాలు, పూల అంగళ్లు, ఆటోస్టాండ్, కారు పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్, ప్రైవేటు బస్టాండ్, నానాసాబ్‌పేట, మార్కెట్ యార్డు, తూర్పుమొగసాల, నగిరిప్యాలెస్ తదితర ప్రదేశాలను చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. పుంగనూరు పట్టణంలోకి కూలి పనులకు వచ్చే వారు, సామాన్యులను టార్గెట్ చేస్తున్నారు. వారికి ఆశలు కల్పించి టికెట్లను అంటగడుతున్నారు. అసలు లాటరీ టికెట్లతో పోలిన డూప్లికేట్ టికెట్లు తయారు చేసుకుని అమాయకుల జేబులను ఖాళీ చేస్తున్నారు. తెల్లారి నుంచి సాయంత్రం 6 వరకు కష్టపడి సంపాదించిన కూలీ సొమ్ము ఖర్చయిపోతోంది తప్ప లాటరీ తగిలింది లేదని పలువురు బాధితులు వాపోతున్నారు. లాటరీ టికెట్ల విక్రయాలను నిరోధించాల్సిన పోలీసులు చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విక్రయదారుల నుంచి రూ.లక్షల్లో మామూళ్లు తీసుకుని ఇలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వున్నాయి.



పుంగనూరు సీఐ సుబ్బరాయుడు

కఠిన చర్యలు తీసుకుంటాం

పుంగనూరు పట్టణంలో నకిలీ లాటరీ టికెట్ల విక్రయాల విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా సరే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా లాటరీలను నమ్ముకుని డబ్బును పోగొట్టుకోవద్దని సూచించారు. టికెట్ల విక్రేతల నుంచి మామూళ్లు తీసుకనే విషయం తనకు తెలియదని, ఇంతకు మునుపు ఏదైనా జరిగివుంటే తనకు సంబంధంలేదు.

–సీఐ సుబ్బరాయుడు, పుంగనూరు

20 ఏళ్ల జైలు



రామకృష్ణ (ఫైల్)

చిత్తూరు లీగల్ : మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో రామకృష్ణ (65) అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కథనం మేరకు.. 2020 జూలై 21న తొమ్మిదేళ్ల వయస్సున్న బాలికపై లైంగికదాడి జరిగిందంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమల మండలం, చింతలవారిపల్లెకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తికి పెళ్లయ్యి పిల్లలున్నారు. ఇతను మద్యానికి బానిసయ్యి.. గ్రామంలో జులాయిగా తిరుగుతుండడంతో భార్య, పిల్లలు ఇతడిని వదిలేసి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఓ మైనర్ బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి, ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడని అభియోగాలు మోపిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.శంకరరావు తీర్పునిచ్చారు.

లీగల్ సెల్ సూపరింటెండెంట్‌పై క్రమశిక్షణా చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లోని లీగల్ సెల్ సూపరింటెండెంట్ షబ్బీర్‌బాషాపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నమోదు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఆయనపై ఉన్న అభియోగాలకు సంబంధించి శుక్రవారం జీవో 688,689,690 లను ప్రభుత్వం జారీ చేసింది. ప్రస్తుతం కలెక్టరేట్‌లో లీగల్ సెల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న షబ్బీర్‌బాషా అలియాస్ షబ్బాబాషా 2023లో జిల్లాలోని శ్రీరంగరాజపురం తహసీల్దార్‌గా పనిచేసేవారు. ఆయన 2023 మార్చి 21న ఒక రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ కేసుకు సంబంధించి ప్రెజెంటింగ్ ఆఫీసర్‌గా ఎల్.వెంకటనాయుడు (ఏసీబీ ఇన్‌స్పెక్టర్)ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీబీ కేసులో పట్టుబడ్డ షబ్బీర్ బాషాపై చార్జెస్ నమోదు చేయడంతో 10 రోజుల్లోపు లిఖిత పూర్వకంగా వివరణ సమర్పించాలని సూచించారు.

నకిలీ టోకెన్ల కలకలం

కార్వేటినగరం: ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్లు కలకలం రేపిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఓ హార్టికల్చర్ అధికారి ఏకంగా నకిలీ టోకెన్ల బుక్, ఫ్యాక్టరీ అధికారి సీలు తయారు చేశాడు. ఫోర్జరీ సంతకాలతో రైతులకు టోకెన్లు ఇచ్చి అటు రైతులను, ఇటు ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని మోసగించాడు. వివరాలు.. మండల పరిధిలోని డీఎం పురం సచివాలయ హార్టికల్చర్ అసిస్టెంటు వెంకటేష్‌ను ప్రభుత్వం మామిడి రైతులకు అందించే ప్రోత్సాహ సొమ్ము రూ.4ను నమోదు చేయడానికి ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద విధులు కేటాయించింది. దురాశతో పుత్తూరులో ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో నకిలీ టోకెన్లు, ఫ్యాక్టరీ అధికారి సీలు తయారీ చేయించాడు. ఆపై ఒక్కో టోకెన్‌ను రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు రైతులకు విక్రయించాడు. ఇలా మొత్తం 34 నకిలీ టోకెన్లను పోలీసులు గుర్తిం సీజ్ చేశారు.

ఇంతకీ ఎమిజరిగిందంటే

నకిలీ టోకెన్ల వల్ల యాజమాన్యం ఇచ్చిన టోకెన్ల కన్నా అధికంగా వాహనాలు రావడంతో పాటు, టోకెన్ల వరుస నంబర్లలో తేడా రావడంతో యాజమాన్యం నిఘా ఉంచింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ హనుమంతప్ప రంగప్రవేశం చేయడంతో అసలు విషయం బయటపడింది. హార్టికల్చర్ అధికారి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30వ తేదీతో అడ్మిషన్ల గడువు ముగిసింది. కళాశాలల అభ్యర్థన మేరకు గడువును పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎట్టకేలకు ‘ఓఆర్ఎం’ ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని ఎస్పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం)లో నూతన ఓఆర్ఎం (ఆయిల్ రీజనరేషన్ మిషన్)ను ఎట్టకేలకు శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ ప్రారంభించారు. పాత మిషన్ రోజూ 200 లీటర్ల నూనెను శుద్ధి చేస్తుంది. కొత్త మిషన్ 2వేల లీటర్లను సిద్ధం చేస్తుంది. రాయలసీమలోనే మొదటి ఓఆర్ఎంను ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ మిషన్ ఏర్పాటుకు రూ.50 లక్షలు మంజూరు చేశారు. నెలల తరబడి మిషన్‌ను అమర్చకుండా తాత్సారం చేశారు. అయితే సాక్షి పత్రికలో పలుమార్లు దీనిపై కథనాలు రావడంతో అధికారులు స్పందించి మిషన్‌ను ఇన్‌స్టాల్ చేశారు. అయితే ఈ మిషన్‌ను ప్రారంభించినప్పటికీ నిర్వహణ, పర్యవేక్షణకు టెక్నీషియన్‌ను నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.



మిషన్ ప్రారంభోత్సవంలో అధికారులు